# కడుపు కక్కుర్తి

రచయిత:
యస్. సరోజానంద్

ఆమె మూడేళ్ళక్రితం రూపుకీ ఇప్పటికీ ఎంత తేడా! తాజమహల్‌లో వుండే జీవకళ, మంత్రముగ్ధుని జేసే ఎల్లోరా—అశోకుని కాలంనాటి అమరస్థూపాలు ఆమె అందంలో నిబిడీకృతమైవుండేవి ఆ రోజుల్లో. అవినే డెక్కడ? ఎందుకూ యీ అందం—ఆమె కురులుధూళితో జటలుకట్టాయి; ఆమె కోక పీలికలైంది నేడు ఆమె అపూర్వ సౌందర్య మెక్కడా కన్పించకుండా ధూళిలో పొర్లాడు శవాగావుంది. శక్తి లేకనే ఆమె మరణించింది. ఆకటికి అల్లాడి అల్లాడి ఎక్కడా పిట్టెడు మెతుకులైనా దొరకక అన్నమో రామచంద్రా అంటూ అలమటించి, అలసిపోయి, విసుగెత్తి ఆరోడ్డు ప్రక్కన శాశ్వతంగా నిద్రపోయింది.

ఆమె నెత్తురే పంచుకొని పుట్టాడా పసిబిడ్డ ఎక్కడ చూసినా ఎముకలు, పొట్ట డొక్కల కంటుకొని పోయిన ఆ అస్థిపంజరంలో పాలెక్కడనుంచొస్తాయి. ఇంత సేపటినుంచీ ఆమె నెత్తురే పీలుస్తున్నాడు. ఇప్పుడా రక్తంగూడా లేదు, నీరైపోయింది. చల్లగా మంచైపోయిందామె. ఎంతసేపు పీల్చినా ఒక్క చుక్కనా రావడంలా కెవ్వున అర్చిమళ్ళీ తల్లి హృదయంలో తలదాచుకుంటున్నాడు. పాపం! ఆ పసివాడికేం తెలుసు, ఇంకా పీలుస్తూనే వున్నాడు.

తల్లి ప్రక్కనేవున్న పదేండ్ల బాలిక కొద్దిగా అర్థం జేసుకుంది తల్లి అవస్థ. తల్లి శవం మీద బడి కాసేపు కొట్టుకుంది. అక్కడ ఆమెనోదార్చే వాళ్ళెవరు? ఆత్మ హృదయం లేని మహా పట్టణం! ఆశ్రయం లేదు—రక్షణ లేదు. ఒక పట్టెడు మెతుకు లేనా లేవు—మానవుణ్ణి తోటి మానవుడిగా గుర్తించే దృష్టి లేదు.

ఎన్నాళ్ళయిందో ఆమె పట్టెడు మెతుకులుదిని. ఎంతసేపని ఏడ్చి మాత్రం మేంజేస్తుంది. బ్రతికినన్నాళ్ళు పొట్టకూటికి ప్రాకులాడటం తప్పదు గదా? తల్లిని పెనవేసికొని ఏడ్చే ఆపసి బాలుణ్ణి ఎంతో ప్రయత్నంమీద ఎంతో ప్రయత్నం మీద విడదీసి చంక నేసుకొని బయల్దేరింది పొట్టకూటి కోసం.

ఆ నిర్భాగ్యురాలు ఆ మార్జన్‌లో వచ్చే పోయే శ్రీమంతుల కార్ల ధూళితో నిండి అలాగే ఆకాశంవంక జూస్తోంది యీ లోకంలోనైనా పట్టెడు కూడు పెడతారా అని అర్థిస్తున్నట్లు.

ఇన్నాళ్ళనుండి ఆమే ఆ బిడ్డల తల్లే నాకు సంపాదించి పెట్టింది. నాకోసం ఆకలితో మాడింది తనను అమ్ముకుంది, చివరికి ప్రాణాలు కూడా యిచ్చింది. ఇప్పుడు ఆమె బిడ్డలకు నేను పట్టెడు కూడు పెట్టిపోషించ లేకపోయాను సరిగదా నాకేమీ పట్టనట్లు మెదలకుండా చూస్తూవూరుకున్నాను. పాషండుణ్ణి మానవుణ్ణి కాదు దానవుణ్ణి. ఆకలి నా మానవత్వాన్ని కూడ చంపేసింది.

ఇంటింటా అర్థిస్తోంది బాలిక "అమ్మా వారం రోజలయింది అన్నందిని ఓ పట్టెడు మెతుకులు పెట్టు తల్లీ" అని.

తొక్కని గడప త్రొక్కకుండా కాళ్ళరిగే వరకూ తిరిగింది బాలిక ఒక్కతల్లైనా పెట్టిన పాపాన పోలేదు. అడుక్కు తినడం నేర్చారు అడుక్కు తినకపోతే పనిజేసుకోరాదూ అనే వారేగాని ఒక్కరైనా పనిజూపించిన వాళ్ళా లేరు హృదయం ఆత్మలేని మానవులు తోటి మానవుల్ని అర్థం చేసుకోలేరు.

తిరిగింది తిరిగింది సాయంకాలం వరకూ

కాళ్ళు బొబ్బలెక్కినయి. కాస్తయినా సత్తువ లేదు స్పృహతప్పి పడిపోయిందా చెట్టుక్రిందే ఆమెను స్పృహవచ్చి చూసేసరికి పిల్లవాడు తల్లిదగ్గరకు ప్రయాణమై పోయాడు. ఎందుకు మరణించాడా పసిపాప? రాతివలె జీవంలేని ఆ నేత్రాల నడగండి. ఒక్క పాల చుక్క కొరకు గొంతారి మరణించాడు ఆ ఒక్క పాలచుక్క ఆకాశంనుండి వర్షించటంగాని భూమినుండి పూరటంగాని జరుగలేదు. చలనంలేని ఆకాశం! చలనంలేని భూమి! కఠినమైన క్రూరమైన చలనంలేని మహా ప్రపంచం. పాషండుడైన తండ్రి.

ఆబిడ్డ నక్కడే వదలివేసి మళ్ళీ బయలుదేరింది బాల ఆకటిమంట కాగలేక. కమ్మని తాళింపు వాసన కొడుతోంది హోటల్లోనుంచి. కడుపు కక్కూర్తి ఎంజేస్తుంది. దొడ్డి వాకిలి తీసేవుంది. సమయం జూచి లోపల ప్రవేశించింది. కనుల పండువైంది. అన్నం ఆరబోసివుంది. ప్రక్కన పాత్రల్లో కూరలు కమ్మని వాసనలు ఎరజమ్ముతున్నాయి. అటూ ఇటూ బిత్తరగా జూస్తూ ఏది చేతికందితే అదే జోలెలో వేసుకొని—ఎట్లాగో తప్పించుకొని బయటపడింది. కాని రాక్షసుడు సర్వర్ చూడనేచూశాడు. ఆమె నిలువునా నీరైంది— ఏజేస్తుంది? కాలికొద్ది పరుగెత్తింది.

“అదుగో, అదుగో చూస్తారేం పరుగెత్తి పోతుంటే పట్టుకోండి? పరుగెత్తండి, దొంగ ముండ నందుగుండా తిరిగిపోతోంది” అంటూ వెంటబడ్డాడు సర్వర్. జనంలో కోలాహలం పెరిగిపోయింది. ఏమిటి? ఏమిటి? అంటున్నారు. జనంలో కొంతమంది.

చిక్కింది బాలిక—యమకింకరులల్లే నలుగురు పోలీసులూ చుట్టుముట్టారు. హంతకుణ్ణనా అంత జాగ్రత్తగా పహారాయివ్వరు. ఇలా ఒకపోటు పొడిచారు తను చేసిన నేరానికి తిన్న దెబ్బలతో కూలబడి పోయిందా ఎముకల గూడు. పోలీసులు గదమాయించి మరీమరీ ప్రశ్నిస్తున్నారు—“ఎందొంగిలించుకు పోదామని జొరబడ్డావ్ హోటల్లోకి?” బాలిక ఏమీ మాట్లాడలేదు గుడ్లనీరుగుడ్ల గ్రక్కుకొని వేటగాడివలలో జిక్కిన లేడిపిల్లలాచూస్తూంది.

ఒకపోటు పొడిచి ప్రశ్నవేశాడు పోలీస్.

ఆమెను పొడిచే ప్రతిపోటూ నాప్రాణాన్ని జివ్వన లాగతుంది ఆమె ఎవరోకాదు నాబిడ్డే నేనొక అసమర్థుణ్ణి భార్యా కొడుకుల చావు నేను నా యీపాపిష్టి నేత్రాలతోనే చూశాను. కాని ఏంచేయగలిగాను. భార్యా బిడ్డల్ని పోషించలేని అశక్తుణ్ణి నేనే వారిచావుకి కారణభూతుణ్ణి.

బాధకు తట్టుకోలేక అమ్మా అని అర్చింది బిడ్డ. ఈసారి చెప్పకతప్పలేదు భయపడుతూ భయపడుతూ “వారం రోజుల్నించి తిండిలేదు బాబూ ఆకలేసింది అందుకని జొరబడ్డా” అంటూ అన్నం మూట జూపింది నా చిట్టితల్లి.

పోలీసుకి ఏమనాలో ఏమీతోచలేదు.

అక్కడ గుమికూడిన జనం తలో విధంగా అనుకున్నారు కడుపు కక్కూర్తి కోసం దొంగతనం చేసిన ఆ అనాధగురించి.

మెల్లగా ఎక్కడి వాళ్ళక్కడ జారుకున్నారు నేను నాశరీరాన్ని భారంగా చెట్టుక్రిందకు చేర్చాను. నాతలపుల థర్మామీటర్లోనా సర్వనాశన మెలా అయిందో ఆ దృశ్యమంతా పైకి లేస్తున్నది. పడుకున్ననా మీద నిద్ర ఆవహిస్తోంది. కలగాన కథ నా మీద స్వారీ జేస్తున్నది. కడుపుకక్కూర్తి, ఆకలి, దరిద్రం నన్నుభయ పెడ్తున్నాయి ‘పాషండుడివి, రాక్షసుడివి, భార్యా బిడ్డలు చస్తూంటే ఏదో మామూలుగా నిత్యం జరిగే సంఘటనే నన్నట్లు చూస్తూ వూరుకున్నావు' అని భీకరంగా అరుస్తూనా మనస్సు నన్ను భయపెడ్తోంది.